






భీమవరం సోమేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు

• ఆచంటేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి, భీమవరం సోమేశ్వరస్వామికి అభిషేకాలు


• వీరంపాలెంలో కలెక్టర్ నాగరాణి కుంభాభిషేకం, చిత్రంలో వెంకటరమణ సిద్ధాంతి

శివోహం

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా హరి నామస్మరణతో శైవక్షేత్రాలు పులకించాయి. బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రముఖ ఆలయాలు లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 7లో..



• పట్టిసీమలో గోదావరి పుణ్యస్నానాలు.. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి అభిషేకం


బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న ఆర్వో వెట్రిసెల్వి

రండి ఓటేద్దాం

పట్టభద్రుల నియోజకవర్గంలో నేడు పోలింగ్..

సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం

- బ్యాలెట్ పత్రాలు.. బ్యాలెట్ బాక్సుల వినియోగం
- ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్..
- గుర్తింపు కార్డులు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి
- స్వేచ్ఛగా ఓటేయండి.. ఆర్వో, కలెక్టర్ వెట్రిసెల్వి

ఉమ్మడి ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నేడు జరగనుంది. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అన్నింటిపై అవగాహన కలిగిన పట్టభద్రులే ఓటర్లుగా ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు మాత్రం ముందస్తుగా ఓటర్లకు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా ముందుచూపు ప్రదర్శించారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలిస్తారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు తగిన సామగ్రితో సహా సిబ్బంది చేరారు. ఈసారి పోలింగ్‌లో బ్యాలెట్ బాక్సులను ఉపయోగిస్తారు.

(ఏలూరు/భీమవరం-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నియోజకవర్గంలో 3 లక్షల 14 వేల 984 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాలోనే 70వేల 052 మంది ఓటర్లు ఉండగా, వీరి కోసం 93 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ఆరంభమై సాయంత్రం నాలుగు గంటలతో ముగియనుంది. ఈలోపు ఎక్కడికక్కడ పోలింగ్ శాతాన్ని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు వెలువడ్డాయి. వాస్తవానికి ఉభయ గోదావరి జిల్లాలో పట్టభద్రులైన ఓటర్లు 3 లక్షల 14 వేల 984 మంది ఉండగా వీరి నిమిత్తం 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వెబ్ కాస్టింగ్ సిద్ధం చేశారు. ఎన్నికలకు సంబంధించి 35 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగేలా 545 మంది ప్రిసైడింగ్ అధికారులు, 545 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1080 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 544 మంది మైక్రో అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద రెండు వేల 714 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి 585 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. వారిలో 234 మంది ప్రిసైడింగ్ సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 117 మంది పరిశీలకులున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పీవో, ఒక ఏపీవో, ఇద్దరు అదనపు పోలింగ్ అధికారులు, ఒక సూక్ష్మ పరిశీలకులను కేటాయించారు. గురువారం పోలింగ్ జరగనుండడంతో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి బుధవారం అధికారులతో మరోసారి సమీక్షించారు. ఎక్కడా లోపం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాల్సిందిగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు.

అంతా టెన్షన్.. టెన్షన్

గడిచిన మూడు నెలలుగా ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో ప్రచారం నిర్వహించిన అభ్యర్థులంతా నేడు తమ అదృష్టాన్ని పరిశీలించుకోబోతున్నారు. పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య భారీగా ఉండడమే కాకుండా ఈసారి ఓటర్ల సంఖ్య ఇదే మాదిరిగా పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల అనుకూలతను బట్టి సుమారు 70 శాతం వరకు పోలింగ్ నమోదయ్యే అవకాశాలు లేకపోలేదని అధికారులు అంచనావేస్తున్నారు. ప్రధానంగా తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం పోటీలో ఉండడంతో ఆయనకు అనుకూలతలు, బలహీనతలపైనే ఇప్పటిదాకా ఎవరంతట వారుగా అంచనాలు వేశారు. అయితే తెలుగుదేశం మాత్రం తమ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందుతారని ఇప్పటికే అంచనా వేసింది. ఇంకోవైపు పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు సైతం టీడీపీ అభ్యర్థికి గట్టి పోటీని ఇచ్చారు. మిగిలిన అభ్యర్థులు నువ్వానేనా అనే తరుణంలో ప్రచారస్త్రాలు సంధించారు. పోటీలో ఉన్న అభ్యర్థులందరి వాదనలు విన్న పట్టభద్రుల ఓటర్లు ఏవైపు మొగ్గుచూపుతారనేదే ఇప్పుడు అందరిలోనూ టెన్షన్.. టెన్షన్ నెలకొంది.

మొత్తం అభ్యర్థులు : 35
ఓటర్లు : 3,14,984

ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి

- జిల్లా కలెక్టర్ నాగరాణి



భీమవరం టౌన్ : జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలతో పాటు సీసీ కెమెరాల ద్వారా వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నామని, పోలింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తారని తెలిపారు. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయాల వద్ద నుంచి పోలింగ్ సామగ్రిని బుధవారం ఉదయం బస్సుల ద్వారా తరలించామన్నారు. ఈ ప్రక్రియ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏఆర్‌వోగా వ్యవహరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, ఆయా డివిజన్ల ఆర్డీవోలు పర్యవేక్షణలో పూర్తి చేశారన్నారు.

ఓటరు స్లిప్పుల గందరగోళం

తాడేపల్లిగూడెం రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల స్లిప్పుల పంపిణీలో సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో గందరగోళం నెలకొంది. గురువారం ఉదయం నుంచి పోలింగ్ జరుగనుండగా బుధవారం మహాశివరాత్రి కావడంతో కొన్నిచోట్ల ఓట్ల స్లిప్పుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇప్పటికే ఓటర్లకు స్లిప్పులు అందించాల్సిన రెవెన్యూ సిబ్బంది పంపిణీలో జాప్యం జరిగింది. 30 శాతం ఓటర్ల స్లిప్పులు పంపిణీకి నోచుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారులను ప్రశ్నించగా ఓటర్ల స్లిప్పుల్లో సరైన అడ్రస్ లేని స్లిప్పులు పంపిణీ చేయలేకపోయామని మిగిలినవి పంపిణీ చేశామని చెబుతున్నారు.


పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తీసుకు వెళుతున్న సిబ్బంది

ఓటు వేసేందుకు వెళుతున్నారా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించే వారంతా ఈ జాగ్రత్తలు పాటించాలి. ఎన్నికల కమిషన్ నిర్దేశించినట్లు తగిన గుర్తింపు కార్డులను అందుబాటులో ఉంచుకుని పోలింగ్ సమయంలో అధికారుల ఎదుట ప్రదర్శించాలి. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్, ఓటరు గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, డిపార్టుమెంట్ గుర్తింపు కార్డు, జాతీయ ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకులు, తపాల శాఖలో జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, పెన్షన్ డాక్యుమెంట్‌ను ప్రతీ ఓటరు కలిగి ఉండాలి.

మీ ఓటు చెల్లాలంటే..!

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు విధానం అందరూ అర్థం, అవగాహన చేసుకోవాలి. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం బ్యాలెట్ పత్రాలను మాత్రమే పోలింగ్‌లో వినియోగిస్తారు. ఓటర్లకు ఒక బ్యాలెట్ పత్రాన్ని అందిస్తారు. ఈ పత్రంలో అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. ఎన్నికల అధికారి ఇచ్చిన పెన్ మాత్రమే ఉపయో గించాలి. ప్రాధాన్యత క్రమంలో మీకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 అని అంకెను వేయాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి 2, 3, 4 ఈ తరహాలో ఓటు వేయవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో ఒకే అంకెను (నెంబర్) ఇద్దరికి వేయకూడదు. అలా వేస్తే మీ ఓటు చెల్లదు. మరో ముఖ్య విషయమేమిటంటే బ్యాలెట్ పత్రంలో ఇష్టమైన అభ్యర్థికి 1 అంకె వేయకుండా ఆ తదుపరి 2, 3, 4 ప్రాధాన్యత క్రమంలో ఓటు వేస్తే అదీ కూడా చెల్లదు. అంకెలు మాత్రం వేయాలి.



తరలి వచ్చిన పట్టభద్రులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాలనుంచి ఓటర్లు తరలివచ్చారు. హైదరాబాద్, బెంగళూరు. విశాఖపట్నం తదితర ప్రాంతాలనుంచి పట్టభద్రులు చేరుకుంటున్నారు. వీరిని రప్పించడంలో కూటమి నేతలు కాస్త ముందు వరుసలో ఉన్నారు. ఏడు నియోజకవర్గాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్ట భద్రులు ఓటింగ్‌లో పాల్గొనడానికి వాహనాలను సమకూర్చారు. ప్రచారంలోనూ కూటమిదే పైచేయిగా నిలిచింది. తాడేపల్లిగూడెంలో 98 శాతం వరకు పట్టభద్రులను గుర్తించారు. ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచేలా తెలుగుదేశం కూటమి ఏర్పాట్లు చేసింది.

పోలింగ్ కేంద్రాలు.. నెంబర్లు

తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూల్ 308, 309, 310, 311, సుబ్బారావుపేట హైస్కూల్ 312, 313, 314 ఈలి వరలక్ష్మి హైస్కూల్ 315, 316, 317, గణపవరం సీహెచ్ బాయ్స్ స్కూల్ 351, 352, మూర్తిరాజు డిగ్రీ కాలేజీ 353, పెంటపాడు పోస్టు బేస్ స్కూల్ 354, 355, గోయంక ప్రభుత్వ కళాశాల 356, తణుకు జడ్పీ బాయ్స్ హైస్కూల్ 357, 358, 359, 360, జాస్తి సీతా మహిళా డిగ్రీ కాలేజీ 361, 362, 363, డిగ్రీ అండ్ పీజీ కళాశాల 364, 365, 366, ఎస్‌సీఐఎం జూనియర్ కాలేజీ 367, 368, ఇరగవరం ఉన్నత పాఠశాల 376, 377, ఎంపీడీవో కార్యాలయం 378, అత్తిలి ఎస్‌వీఎస్ సైన్స్ కళాశాల 379, 380, 381, ఉండి ఉన్నత పాఠశాల 382, 383, ఆకివీడు సరోజిని నాయుడు జడ్పీ స్కూల్ 384, 385, 386, కాళ్ళ జిల్లా పరిషత్ స్కూల్ 387, 388, భీమవరం పీఎస్ఎం పాఠశాల 389, 390, 391, 392, మహాత్మా గాంధీ ఎలిమెంట్రీ స్కూల్ 393, లూథరన్ హైస్కూల్ 394,395, 396, 397, ఎస్‌సీహెచ్ బీఆర్ఎం స్కూల్ 398, 399, 400, 401, పాలకోడేరు ఆర్ఎం జడ్పీ స్కూల్ 402, 403, 404, వీరవాసరం ఎంకేఎం ఉన్నత పాఠశాల 405, 406, 407, పెనుమంట్ర బ్రాహ్మణచెర్వు స్కూల్ 408, 409, ఆర్పి ఉన్నత పాఠశాల 410, పెనుగొండ ఎస్‌వీకేపీ ఎయిడెడ్ స్కూల్ 411, 412, జిల్లా పరిషత్ స్కూల్ 413, ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ స్కూల్ న్యూబిల్డింగ్ 414, 415, ఎంపీపీ స్కూల్ 416, పోడూరు జడ్పీ స్కూల్ 417, 419, ఎంపీపీ స్కూల్ 418, పాలకొల్లు బీఆర్ఎంవీ స్కూల్ 420, 421, 422, 423, ఎంకేఎం స్కూల్ 424, 425, 426, 429, వీఎస్ఎం స్కూల్ 427, 428, యలమంచిలి ఎంపీపీ స్కూల్ 430, 431, గ్రామ పంచాయితీ కార్యాలయం 432, నరసాపురం టేలర్ హైస్కూల్ 433, 434, టేలర్ ఎలిమెంట్రీ స్కూల్ 435, 436, మునిసిపల్ యూపీ స్కూల్ 437, 438, మొగల్తూరు సర్వశిక్షాభియాన్ స్కూల్ 439, 440.


తమ్మిలేరులో మునిగి అన్నదమ్ములు మృతి

7















హరోం హర

శైవ క్షేత్రాలు కిటకిట

మార్మోగిన శివ నామం

గునుపూడి సోమారామం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తుల తాకిడి కనిపించింది. క్యూలైన్‌లు భారీ ఉండడంతో ఎండలో ఉన్నవారు. అవస్థలు పడ్డారు. కాళ్లు కాలుతున్నా ఎండలో ఉండి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. దాదాపు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారుల అంచనా. ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు పర్యవేక్షణలో తెల్లవారుజామున ఆలయ అర్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ధ్వజ స్థంభం వద్ద దీపాలను వెలిగించారు. డీఎస్పీ జయసూర్య, వన్ టౌన్ సీఐ అనాగరాజు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ఆలయం మీదుగా వాహన రాకపోకలను మళ్లించారు. డిప్యూటీ స్పీకర్ రఘు రాకృష్ణరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, మాజీ ఎమెల్యే గ్రంధి శ్రీనివాస్ దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. వీఐపీల పేరుతో భక్తుల తాకిడితో పలువురు అసహనం వ్యక్తం చేశారు.

భీమేశ్వరస్వామికి మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు. అలయ ఈవో తోట శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకులు పూజలు చేశారు.

పాలకొల్లు క్షీరారామం

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం హరహర మహాదేవ శంభో శంకర.. శివ నామస్మరణతో హోరెత్తింది. తెల్లవారు జామున 4 గంటల నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. డిప్యూటి స్పీకర్ కె రఘురామకృష్ణరాజు, కలెక్టర్ సి.నాగరాణి, మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఎమ్మెల్యేలు తోట త్రిమూర్తులు, ఉదయభాను, నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు స్వామి వారిని దర్శించుకున్నారు ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పర్యవేక్షణలో ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, సమీప ఆలయాల సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ కేడెట్లు, సత్యసాయి సేవా సంస్థలు సేవలందించారు. పట్టణ ఎస్‌ఐ కె.రజనీ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు.

మాడ వీధుల్లో పాగా ఊరేగింపు

శ్రీశైలం, పాలకొల్లులో మాత్రమే మహాశివ రాత్రి రోజున అలంకరించే మల్లన్న పాగాను బుధవారం సాయంత్రం భక్తులతో కలిసి అలయ మాడ వీధుల్లో ఊరేగించారు. దగ్గులూరుకు చెందిన వరదా సోమేశ్వరరావు, రామకోటి మాణిక్యం దంపతులు 18 అడుగుల వెడల్పుతో 360 మూరల పాగా నేసి స్వామివారికి అందజేశారు. లింగోద్భవ సమయంలో ఆలయ గాలి గోపురం నుంచి ఆలయ శిఖరానికి పాగా అలంకరించనున్నారు.



బలివే రామలింగేశ్వర క్షేత్రం వద్ద తమ్మిలేరులో భక్తుల పుణ్యస్నానం



నరసాపురం వలంధర్ రేవులో స్నానమాచరిస్తున్న భక్తులు

ఆచంట రామేశ్వరస్వామి

ఆచంట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రం ఆచంటేశ్వరుడి ఆలయం భక్తుల శివ నామస్మరణతో హోరెత్తింది. వేకువ జామునే భక్తులో పుణ్యస్నానాలు ఆచరించి రామేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ఎమ్మెల్యే పితాని సత్యనారా యణ, అనంతలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి సత్యనారాయణ, ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ స్వామి వారి ప్రసాదం చిత్రపటం అందజేశారు.

వైభవంగా రథోత్సవం

ఆచంటేశ్వరుని రథోత్సవం వైభవంగా జరిగింది. పూలతో అలంకరించిన రథంపై స్వామి అమ్మవార్లు ప్రధాన వీధుల్లో తిరుగాడారు. వేల సంఖ్యలో భక్తులు రథాన్ని లాగడానికి ముందుకు వచ్చారు. సీఐ రాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెంకటరమణ పోలీసు బందోబస్తు నిర్వహించారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధనలో వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

వీరంపాలెం వీరేశ్వరస్వామి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం బాలాత్రిపుర సుందరిదేవి క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆత్మలింగానికి 12 నదీజలాలతో అభిషేకం నిర్వహించారు. మహా దేవునికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. స్వామివారిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తదితరులు మహాదేవునికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉమర్ ఆలీషా ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఉదయం నుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్‌లలో క్షేత్ర కార్యకర్తలు మంచినీరు అందించడంతో పాటు రుద్రాక్షలు, ప్రసాదాలు అందించారు.



ఆచంటలో వైభవంగా సాగిన రామేశ్వరస్వామి రథోత్సవం



బలివే రామేశ్వరస్వామి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు



ఆకివీడు వీరభద్రుడి సంబరంలో నోటిలో శూలాలతో యువకులు



పట్టిసీమ గోదావరి వద్ద పిండ ప్రదానం

పట్టిసీమ వీరేశ్వరుడు

పోలవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివ నామ స్మరణతో పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రం మార్మోగింది. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజామున భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి పితరులకు పిండ ప్రదానం అర్పించి దీపపు తెప్పలు నదిలో వదిలారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం, ఇసుక తిన్నెల్లో కాలినడక బాట, ఫెర్రీ రేవులు, స్నానాల ఘాట్‌లు, గోదావరిపై ఏర్పాటు చేసిన కాలినడక బాటలు నిండిపోయాయి. తెల్లవారుజామున ఆలయ వంశపారంపర్య ట్రస్టీలు కొచ్చర్లకోట వెంకట జగన్నాధరావు తదితరులు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, ఫెర్రీ రేవు, ఇసుక తిన్నెల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఏర్పాటు చేసిన వాటర్ పాకెట్లు భక్తులకు ఉపయోగపడ్డాయి. ఇసుక తిన్నెల్లో 6 ఉచిత అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. నదిపై రాకపోకలకు వేసిన పంట్లు, ఇసుక తిన్నెల్లో కాలినడక సౌలభ్యం కోసం వేసిన గోనె సంచుల బాట భక్తులకు ఉపశమనం కలిగించాయి. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నదిలో స్పీడు బోట్లతో నిరంతర పర్యవేక్షణ చేశారు. పోలవరం, కొవ్వూరు ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉత్సవ, భద్రతా ఏర్పాట్లను ఆర్డీవో ఎంవి.రమణ, డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేష్‌బాబు, ఎస్‌ఐ పవన్‌కుమార్ పర్యవేక్షించారు. లడ్డూ, పులిహోర ప్రసాదం కౌంటర్లు అదనంగా ఏర్పాటు చేశారు.

బలివే రామేశ్వరుడు

ముసునూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బలివే శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనానికి మహాశివరాత్రి పర్వదినాన భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం హరహర మహదేవ శంభో శంకర నామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజారుము స్వామివారికి మహారుద్రాభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ, విశేష పూజల అనంతరం 2గంటల నుంచి స్వామి వారి సర్వదర్శనం కల్పించారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు రాజమండ్రి, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి లక్షమంది పైగా భక్తులు తరలివచ్చారు. పుణ్యస్నానాలు చేసే భక్తులతో తమ్మిలేరు జన సంద్రంగా మారింది. పితృదేవతలకు పిండప్రదానాలు చేసి, స్నానమాచరించి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిశాయి. స్వామి దర్శనానికి గంటల సమయం వరకు వేచి ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని సైతం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బాహ్య శివలింగానికి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో డీఎస్పీ ప్రసాద్, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ ఎం.చిరంజీవి పటిష్ట బందోబస్తు నిర్వహించారు. సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్. ఉత్సవాల ప్రత్యేకాధికారి అనురాధ, నోడల్ అధికారి, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య తదితరులు భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా పర్యవేక్షించారు. స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం తాత గుడి వద్దకు గ్రామోత్సవంగా వెళ్లి ఆశీస్సులు తీసుకుంటారని ఈవో సీతారామయ్య తెలిపారు.

ఊబిలో చిక్కుకున్న బాబాయ్, అబ్బాయ్

లభ్యంకాని ఆచూకీ



గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్న డీఎస్పీ

ఏలూరు క్రైం/పెదపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి దిగి ఊబిలో కూరుకుపోయిన బాబాయ్‌ను రక్షించబోయిన అబ్బాయ్ కూడా ఊబిలో చిక్కుకున్నాడు. వారిద్దరూ కాపాడమని కేకలు వేసినా స్థానికులు నిస్సహాయంగా నిలబడిపోయారు. అగ్నిమాపక శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వట్లూరుకు చెందిన జిజ్జువరపు వెంకటేశ్వరరావు (50), అతని తమ్ముడి కుమారుడైన జిజ్జువరపు సుబ్రహ్మణ్యం (30) కుటుంబంతో కలిసి బుధవారం బలివే ఆలయానికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చారు. వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మరికొంత మంది సాయంత్రం గ్రామంలోని చెరువుగట్టుపై కూర్చున్నారు. స్నానం చేస్తానని వెంకటేశ్వరరావు చెరువులోకి దిగి ఊబిలో దిగబడ్డాడు. బాబాయ్‌ను కాపాడుకోవాలని సుబ్రహ్మణ్యం కూడా దిగాడు. ఇద్దరూ ఒకరినొకరు పట్టుకుని ఊబిలో కూరుకుపోతూ కాపాడాలంటూ కేకలు వేశారు. స్థానికులు చూస్తుండగానే క్షణాల్లోనే నీటమునిగి పోయారు. సమాచారం అందుకున్న ఏలూరు జిల్లా అదనపు అగ్ని మాపక శాఖ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టారు. మరోవైపు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, త్రీటౌన్ సీఐ వి కోటేశ్వరరావు, ఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది రాత్రి ఏడు గంటల వరకూ గాలింపు చేపట్టినా ఆచూకీ కానరాలేదు. చివరకు రెస్క్యూటీమ్ తమ ప్రయత్నాలను నిలిపివేసింది. బంధువులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తమ వారి కోసం తల్లడిల్లిపోతూ రోదించడం చూపరులను కలచివేశాయి.

శివరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి

తమ్మిలేరులో మునిగి అన్నదమ్ములు మృతి



సంఘటనా స్థలి వద్ద అన్నదమ్ముల మృతదేహాలు, రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- మృతదేహాల వెలికితీత
- తిమ్మక్కపాలెంలో విషాదం

పెదవేగి/ముసునూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బలివే మహా శివరాత్రి ఉత్సవాల్లో విషాదం చోటు చేసుకుంది. తమ్మిలేరులో పుణ్యస్నానాల అనంతరం ఈత సరదా అన్నదమ్ములకు మృత్యుపాశమైంది. లింగపాలెం మండలం తిమ్మక్కపాలేనికి చెందిన పేరిచర్ల మారేష్, మంగమ్మ, వారి ఇద్దరు కుమారులు మునియ్య, మణి కుమార్, బంధువులతో కలిసి బుధవారం బలివే ఆలయం వద్ద తమ్మిలేరులో స్నానాలు చేసి దర్శనానికి బయలుదేరారు. మారేష్ కుమారులిద్దరూ కొద్దిసేపు స్నానంచేసి వస్తామన్నారు. దర్శనానికి వెళ్లి వచ్చిన తల్లిదండ్రులు కుమారులిద్దరూ రాకపోవడంతో జనంలో ఉన్నారేమోనని వెతు కుతు తమ్మిలేరు దగ్గరకు చేరుకున్నారు. ఇంతలో తమ్మిలేరు స్నానఘట్టాలకు ఎగువన మునిపల్లె సమీపంలో తమ్మిలేరు నీటిమడుగులో మృతదేహం ఉందనే సమాచారం తెలిసింది. అక్కడికి వెళ్లిన తల్లిదండ్రులకు చిన్న కుమారుడు మణి కుమార్ (18) మృతదేహం కనిపించడంతో హతాశులయ్యారు. మరో కుమారుడు ఎక్కడో చోట ఉన్నాడనే ఆశతో వెతుకుతుండగా నీటి మడుగులో గాలిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందాలకు పెద్ద కుమారుడు మునియ్య (20) మృతదేహం కూడా లభించింది. అప్పటివరకు కళ్లెదుటే ఆడుతూ, పాడుతూ ఉన్న ఇద్దరు కుమారులు విగతజీవులుగా కనిపించడంతో తల్లి మంగమ్మ, తండ్రి మారేష్, బంధువుల రోదనలతో విషాదం అలుముకుంది. దీనిపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ముసునూరు ఎస్‌ఐ తెలిపారు. ఒకపక్క పోలీసులు హెచ్చరిస్తున్నా పట్టించుకోకుండా తమ్మిలేరులో దిగడంతో వారు దుర్మరణం పాలయ్యారని అక్కడివారు చెబుతున్నారు. స్నాన ఘట్టాల సమీపంలో తమ్మిలేరు లోపకలికి వెళ్లనీయడంలేదని వారిద్దరు అక్కడకు కొద్ది దూరంలో ఎగువ భాగంలో నీటిలో దిగి, మృత్యుఒడికి చేరడం విషాదం.

గుండెపోటుతో ఇద్దరు..

పోలవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. బుధవారం ఇసుక తిన్నెల్లో అన్నదానం నిర్వహించడానికి వచ్చిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు మండవల్ల నాగ వీరభద్రరావు(67) గుండెపోటుతో మృతి చెందారు. అన్నదాన సత్రం సమీపం నుంచి లఘుశంఖ తీర్చుకోవడానికి ఇసుక తిన్నెల్లో కొంతమేర నడిచి వచ్చిన ఆయన గుండెనొప్పితో కుప్పకూలిపోయారు. వైద్య సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

బలివే ఆలయం వద్ద..

ముసునూరు: బలివే రామేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఏలూరు టౌన్‌కు చెందిన బోర అన్నవరం (45) స్వామివారి దర్శనం అనంతరం ఒక్కసారిగా కూప్పకూలిపోయాడు. డాక్టర్ షకీనా ఇవాంజలి సీపీఆర్ చేసి, 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు. అప్పటికే అన్నవరం మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భక్తులు దైవ దర్శనంతోపాటు పర్యావరణ పరిరక్షణ కూడా దైవకార్యంగా భావించాలని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ కార్యదర్శి నందమూరి రాజేష్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు గుడ్డ సంచులను అందించారు. భక్తులు ప్లాస్టిక్‌ను నిషేధించి గుడ్డ సంచులనే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, మల్లేశ్వరరావు, గోపిశెట్టి కృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 26: విజ్ఞులైన పట్టభద్రులు తమ పవిత్రమైన ఓటు హక్కును ఇచ్ఛింతంగా వినియోగించుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి పోలింగ్ బూతుల ఏజెంట్లతో సన్నాహక సమావేశాన్ని కోళ్ళ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెంట్లుకు పోలింగ్ బూతులలో నిర్వహించవల్సిన విధి విధానాలను చర్చించారు.







పాలకొల్లులో శంభేశ్వర స్వామి.. యలమంచిలిలో ఉమా సోమేశ్వర స్వామి.. ఆకివీడులో భీమేశ్వర స్వామికి అభిషేకాలు.. సిద్ధాపురం రామలింగేశ్వరస్వామికి స్వయంగా అభిషేకం చేసుకుంటున్న భక్తులు.. దిరుసుమర్రులో శివుడికి అభిషేకం

శంభో శివ శంభో

» శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు
» శివుడికి అభిషేకాలు.. ప్రత్యేక పూజలు
» మధ్యాహ్ననికి కూడా తగ్గని భక్తుల తాకిడి
» ఆలయాల్లో భారీగా అన్నసమారాధనలు

ఆకివీడు/ఆకివీడు రూరల్/భీమవరం రూరల్/పెనుగొండ /తణుకు/తణుకు రూరల్/పెంటపాడు/నరసాపురం/భీమవరం టౌన్/తాడేపల్లిగూడెం రూరల్/మొగల్తూరు/పోడూరు/కాళ్ళ /గణపవరం/పాలకొల్లు అర్బన్/పాలకొల్లు రూరల్/పాలకోడేరు /ఉండి/యలమంచిలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. ఆకివీడులో బుధవారం తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు ఆచరించి స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి, వీరభద్రస్వామి, అగస్త్యేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి (పాత శివాలయం), పార్వతి సమేత వెంకట లింగేశ్వరస్వామి, ధర్మాపురంలో పురాతన శివాలయాల్లో బారులు తీరిన భక్తులు పరమశివుని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాలిపేటలో వీరభద్ర సంబరం, ప్రభ ఊరేగింపు భక్తులను ఆకర్షించాయి. నిప్పులగుండం తొక్కే భక్తులు బుగ్గలకు కత్తులు గుచ్చుకుని ఎడ్లబళ్లు, ట్రాక్టర్లపై ఊరేగారు. రాత్రి భక్తులు నిప్పుల గుండం తొక్కారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద బాణసంచా కాల్చుతూ తెప్పోత్సవం నిర్వహించారు.

● ఆకివీడు మండలంలోని సిద్ధాపురంలో భక్తులు స్వయంగా శ్రీరామలింగేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అభిషేకం నిర్వహించేందుకు భక్తులు బారులు తీరారు. కళింగగూడెం, కోళ్ళపర్రు, గుమ్ములూరు, చినకాపవరం, పెదకాపవరం, అయిభీమవరం, చెరుకుమిల్లి, కుప్పనపూడి గ్రామాలలోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి.

● భీమవరం మండలం దిరుసుమర్రులో గంగా భ్రమరాంబిక సమేత రామలింగేశ్వరస్వామి, యనమదుర్రు గ్రామంలోని శక్తీశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

● సిద్ధాంతం పవిత్ర వశిష్ఠ గోదావరి నదిలో తెల్లవారుజాము మూడు గంటల నుంచి వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి భారీ క్యూలైన్‌లో నిలబడి శ్రీ కేదారేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సిద్ధాంతం రావి చెట్టుసెంటర్‌లో పార్వతి సమేత నందీశ్వర స్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెనుగొండ మహిషాసుర మర్దని సమేత నగరేశ్వరస్వామి, వాసవి అమ్మవారు, చెరుకువాడలో ఉమా విశ్వేశ్వర స్వామి తదితర ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. శివాలయాలను విద్యుత్ దీపాలు, పూల అలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు.

● తణుకులోని పాతూరులో ఉమాసిద్దేశ్వర స్వామి, కపర్దేశ్వర స్వామి, సోమేశ్వర స్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో రాజరాజేశ్వర స్వామి ఆలయం, కోనాలలోని సోమేశ్వర స్వామి, పైడిపర్రు, దువ్వ, మండపాక, కొమరవరం, వేల్పూరు గ్రామాల్లో గల శివాలయాలలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పెంటపాడు పార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. లక్షపత్రిపూజలు నిర్వహించారు. బోడపాడు, అలంపురం, మీనవల్లూరు, వల్లూరు పల్లి తదితర గ్రామాలలో శివాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

●నరసాపురంలో తెల్లవారు జామున పెద్ద సంఖ్యలో వలంధర్, మండలంలోని రాజుల్లంక గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అర్ధ రాత్రి నుంచి శివాలయాల్లో భక్తులు క్యూ కట్టారు. పట్టణంలోని అమరేశ్వర, కపిలమల్లేశ్వర, ఏకాంబరేశ్వర, జగన్నాథస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. లక్ష్మణేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దాదాపు 50వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవంలో కూడా వేలాదిగా పాల్గొన్నారు. అన్నసమారాధనలు నిర్వహించారు.



వీరంపాలెం క్షేత్రంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే బొలిశెట్టి

● భీమవరం రెండోవ పట్టణంలోని స్వయంభూ భైరవ స్వామి దేవాలయంలో స్వామివారికి భస్మాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రభాకర్ శేషు శర్మ ఆధ్వర్యంలో సుంకరవారి కుటుంబ సభ్యులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాలతో పూజ చేసి సాంప్రదాయ బద్ధంగా భస్మాభిషేకం నిర్వహించారు. అన్నపూర్ణ దేవి అమ్మవారికి పసుపు కుంకుమలతో కుంకుమార్చన చేశారు.

● నవాబుపాలెం భువనేశ్వరి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. మాదవరంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, అప్పారావుపేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు.

● మొగల్తూరు మండలం వడయారేపేటలోని వనమల్లిఖార్జున స్వామి ఆలయంలో నేరుగా భక్తులు స్వామివారిని తాకి పూజలు చేసుకునే అవకాశం ఉండటంతో పలు ప్రాంతాల నుంచి ఈ ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

● పోడూరులోని మూలేశ్వరస్వామి, రాజేశ్వరస్వామి, కేశవస్వామి, పెనుమదం ఉమాఅగస్త్యేశ్వరస్వామి ఆలయాలతో పాటు అన్ని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. జిన్నూరులో శ్రీఅన్నపూర్ణమ్మ ఆలయంలో సుమారు 10వేల మందికి పైగా భక్తజనం అన్నప్రసాదాలను స్వీకరించారు.

● కాళ్ళ, ఏలూరుపాడు, దొడ్డనపూడి, కలవపూడి, కాళ్ళకూరు, బొండాడ, పెద అమిరం, కోపల్లె, జువ్వలపాలెం, కొలనపల్లి, సీసలి తదితర గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాలు శివనామస్మరణతో మారుమోగాయి. కోలనపల్లి, సీసలి, కలవపూడి గ్రామాల్లో శివరాత్రి వేడుకలు పురస్కరించుకుని అఖండ అన్నసమారాధనలు నిర్వహించారు.

● గణపవరంలో దుర్గాంబసమేత సువర్ణేశ్వరస్వామి, బస్టాండ్ వద్ద భ్రమరాంబ మల్లికార్జున స్వామి, పిప్పరలోని పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆధ్యాత్మికవేత్త కొలనువాడ సుబ్బరాజు ఆధ్వర్యంలో 24 గంటల పాటు సంకీర్తనలు నిర్వహించారు.

● పాలకొల్లు కోడిగట్టు శంకరమఠంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. 24వ వార్డులోని శంభేశ్వర స్వామి ఆలయంలోనూ ఏక వార రుద్రాభిషేకాలు, ఆవు పాల అభిషేకాలు నిర్వహిం చారు. మఠం వీధిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం మంగళవారం రాత్రి యర్రా రాజేష్, కేశవర్ధినీ దంపతులచే జరిపించారు. బుధవారం ఉదయం జాతర, ఉత్సవాలు నిర్వ హించారు. అదే విధంగా 22వ వార్డు కొత్తపేటలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో పూజలు అభిషేకాలు నిర్వహి ంచారు. ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఆలయ కమిటీ సభ్యులతో కలసి ఊరేగింపులో పాల్గొన్నారు.



భీమవరంలో భైరవస్వామికి భస్మాభిషేకం

● శివదేవుని చిక్కాలలోని పార్వతీ సమేత శివదేవస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేశారు. ఈ ఆలయానికి కొబ్బరి మొక్కలతో భక్తులు పోటెత్తారు. సంతానం లేని దంపతులు కొబ్బరి మొక్కల నాటారు. అలాగే భగ్గేశ్వరంలోని కోటిలింగేశ్వరస్వామి పార్వతీ అమ్మవార్లకు కన్నుల పండువుగా కల్యాణోత్సవం నిర్వహించారు.

● పాలకోడేరు మండలంలోని గరగపర్రు గ్రామంలోని నాగయోగి, బాలయోగి మందిరాల వద్ద భక్తులు బారులుతీరి పూజలు నిర్వహించారు. అదేవిధంగా శృంగవృక్షం, వేండ్ర అగ్రహారం, మోగల్లు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ఉపవాసాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఉండి మండలం యండగండి, కోలమూరు, మహదేవపట్నం, పాందువ్వ, చెరుకువాడ, వాండ్రం, ఎన్ఆర్‌పి అగ్రహారం, కలిసిపూడి, ఉండి గ్రామాలలోని శివాలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉండిలోని శివాలయం వద్ద వివిధ సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

● యలమంచిలి, ఊటాడ, చించినాడ, మట్లపాలెం, మేడపాడు, లక్ష్మీపాలెం, దొడ్డిపట్ల, గుంపర్రు తదితర గ్రామాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. యలమంచిలి ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఊటాడ గ్రామంలో పార్వతీరామలింగేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. యలమంచిలి శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జాగారం భక్తులకు అల్పాహారం

పాలకొల్లు శ్రీక్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకుని రాత్రి జాగారం చేస్తున్న భక్తులకు పాలకొల్లు రూరల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అల్పాహారం, ప్రసాదాలను పంపిణీ చేశారు. తొలుత రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు భక్తులకు స్వయంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే బంగారు ఉషారాణి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిర్లంచర్ల సుబ్రహ్మణ్యం, సంఘ అధ్యక్షుడు సన్నిది సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు కందగట్ల మల్లీశ్వరరావు, ప్రధానకార్యదర్శి నంబూరి రామలింగేశ్వరరావు, కోశాధికారి సన్నిది ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



కాళ్ళలో శివయ్య దర్శనం కోసం క్యూలో నిల్చొన్న భక్తులు



మొగల్తూరులో పార్వతి విశ్వేశ్వర స్వామికి అభిషేకాలు



నవాబుపాలెంలో స్వామివారికి పూజలు



పాలకొల్లులో మంత్రి నిమ్మల అల్పాహారం పంపిణీ

అనధికారిక ఘాట్లలో స్నానాలు వద్దు: ఎస్పీ

భీమవరం క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అనధికారిక ఘాట్లలో స్నానం చేయకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోతే అనుకోని ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతుందని అన్నారు. లైఫ్ గార్డులు, బారికేడ్లు, ఈతగాళ్ళు ఘాట్ల వద్ద లేరు కావున ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. బలమైన ప్రవాహాలు, లోతు గురించి తెలియకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మురికి నీరు, మలినమైన నీరు ఆరోగ్య సమస్యలు వస్తాయని సూచించారు. అనధికారిక ఘాట్ల వద్ద ఎటువంటి కార్యక్రమాలు చేయరాదని, అలా చేయడం నిషేధించబడిందన్నారు.

ముగిసిన తణుకు జోన్ క్రీడలు

ఇరగవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగు తున్న తణుకు జోన్ క్రీడా పోటీలు బుధ వారంతో ముగిసినట్లు ఆ పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు జి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీల్లో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలకు సంబంధించి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. జోన్‌లో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 28 నుంచి శృంగవృ క్షంలో జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో పాల్గొం టారని తణుకు నియోజకవర్గ కో ఆర్డినేటర్ సంకు సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈసం దర్భంగా జోన్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

దుప్పట్లు, ఆహారం పంపిణీ

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, ధార్మిక సేవా తత్పరుడు, దివంగత కారుమూరి నరసింహమూర్తి 70వ వర్ధంతి సందర్భంగా భీమవరం వన్‌టౌన్‌లోని గంధం అపార్ట్‌మెంట్‌లో పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలను మనుమడు కారుమూరి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. త్యాగరాజ భక్త సభ నిర్వాహకులు చెరుకువాడ వెంకట్రామయ్య, అల్లు శ్రీనివాస్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కారుమూరి లక్ష్మి పాల్గొన్నారు.

పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీ

రూ.5.20 లక్షల సొత్తు స్వాధీనం

తణుకు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలోని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఎన్. కొండయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాళం వేసి ఉన్న ఇళ్ళనే లక్ష్యంగా పగలు రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న పెనుగొండ శివారు బాబూజీపాలెంకు చెందిన తానేటి ఆశీర్వాదంను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందుతుడి నుంచి రూ.5.20లక్షల విలువైన 69.5గ్రాములు బంగారు ఆభరణాలు, 1144గ్రాములు వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.



కుంభమేళా జలం పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాగరాజ్‌లోని కుంభమేళా జలాన్ని తాడేపల్లిగూడెంకు చెందిన జీకే ఆనంద్, శశికళ దంపతులు తాడేపల్లిగూడెంలో హిందు బంధువులకు బుధవారం శివరాత్రి సందర్భంగా పంపిణీ చేశారు. కుంభమేళాకు వెళ్లాలని హిందువులు బావిస్తారని కాని సదుపాయాలు దొరక్క కొన్ని కారణాల రీత్యా కుంభమేళాకు వెళ్లని వారికోసం పవిత్ర జలం అందించాలని సంకల్పించామని జీకే ఆనంద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కాటన్ ధరలు తగ్గితేనే స్పిన్నింగ్ మిల్లులకు మనుగడ



భారత కాన్సులర్ జనరల్‌తో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కాటన్ ధరలను తగ్గించగలిగితేనే ఇండియాలో కాటన్ స్పిన్నింగ్ మిల్లుల మనుగడ సాగిస్తాయని, దానికి అనుగుణంగా కాన్సులేట్ కూడా సహకరించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం వియత్నాంలోని భారత కాన్సుల్ జనరల్ డా. వి. ప్ర పాండేతో కలిసి అంతర్జాతీయ టెక్స్‌టైల్ ఫెయిర్‌ను సందర్శించిన సందర్భంలో పలు విషయాలను చర్చించినట్లు రవీంద్రనాథ్ చెప్పారు. భారత్ నుంచి వియత్నాంకు ఎగుమతులపై దృష్టి పెట్టాలని, కాన్సులేట్ తరుపున అన్ని సహకారాలు అందిస్తామని పాండే అన్నారని తెలిపారు. వస్త్ర పరిశ్రమను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. వంక రవళి, వికాస్ పాల్గొన్నారు.

బూత్ ఇన్‌చార్జులకు శిక్షణ



బూత్ ఇన్‌చార్జిలకు ఓటర్ల జాబితాను అందజేస్తున్న వలవల బాబ్జి తదితరులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : ఎంఎల్‌సీ ఎన్నికల కు సంబంధించి బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో బూత్ ఇన్‌చార్జిల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ను బూత్‌ల వారీగా ఇన్‌చార్జిలకు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ చైర్ పర్సన్ ప్రణవ్ గోపాల్, పరిశీలకులు నక్కా చిట్టిబాబు, పట్నాల రాంపండు, దాట్ల జగన్నాధరాజు పాల్గొన్నారు





యలమంచిలిలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది.. నరసాపురంనుంచి పోలింగ్ బూత్‌లకు వెళుతున్న సిబ్బంది.. తాడేపల్లిగూడెంలో ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఆకివీడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలు కీలక ఘట్టానికి తెరలేచింది. ఆకివీడులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో మండలంలోని 2046 మంది ఓటర్లు గురువారం ఓటు హక్కు వినియోగించుకుంటారు. పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

తణుకు: ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ చెప్పారు. పోలింగ్‌కు 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలలో మూడు, బాలురున్నత పాఠశాలలో నాలుగు, ఎస్కేఎస్‌డి డిగ్రీ కాలేజీలో మూడు, ఎస్కేఎస్‌డి జూనియర్ కాలేజీలో రెండు కేంద్రాలు కలిపి 12 కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఆయా కేంద్రాల్లో పురుషులు 4,614, మహిళలు 3,922 మంది కలిపి 8,536మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు.

పెంటపాడు: ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 1863 మంది ఓటర్లు ఉండగా పెంటపాడు పోస్టుబేసిక్ పాఠశాలలో 2, డీఆర్ గోయింకా డిగ్రీ కళాశాలలో 1 పోలింగ్ కేంద్రాలు కేటాయించామని ఇన్‌చార్జి తాహసీల్దార్ బీ.సీతారత్నం తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

నరసాపురం/పాలకొల్లు అర్బన్/ఆచంట: నరసా పురం, పాలకొల్లు, అచంట నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో మొత్తం 28612 మంది ఓటర్లు ఉన్నారు. వీరికోసం 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు నరసాపురం ఆర్డీవో, సబ్ డివిజన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసిరాజు చెప్పారు. మొత్తం 180 మంది సిబ్బందిని నియమించారు. వీరంతా బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసి, విధుల్లో హాజరయ్యారు. వీరిందరికి సామగ్రి అందించి పోలీస్ బందోబస్తుతో బస్సుల్లో కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం4 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను భీమవరం తరలించనున్నట్లు ఆర్డీవో చెప్పారు. నరసాపురంలో మొత్తం 5451 మంది ఓటర్లు ఉన్నారు. ఆచంటలో మొత్తం 1895 ఓటర్లు ఉన్నారు. ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు, బాయిస్ స్కూలు వద్ద ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పాలకొల్లు పట్టణంలోని బీఆర్ఎంవిఎం హైస్కూల్లో 4 పోలింగ్ బూత్‌లు, ఎంఎంకెఎన్ఎస్ఎం హైస్కూల్లో 4

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

బూత్‌లు, బ్రాడీపేటలోని ఎవిఎస్ఎన్ఎం హైస్కూల్లో 2 బూత్‌లు ఏర్పాటు చేశారు. 7957 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

పోడూరు: పోడూరు జడ్పీహైస్కూల్‌లో రెండు కేంద్రాలు, సొసైటీ వద్ద ఉన్న ఎంపీపీ స్కూల్‌లో ఒక కేంద్రం మొత్తం 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎస్ఎ.ఫాజిల్ తెలిపారు. మండలంలో మొత్తం 2363 ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నట్లు తెలిపారు.

గణపవరం: గణపవరంలో పట్టభద్రుల ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలో 1877 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. వీరంతా గణపవ రంలోని జిల్లా పరిషత్ బాలురహైస్కూల్‌లోని రెండు పోలింగ్ బూత్‌లు, గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన బూత్‌లో ఓట్లు వేస్తారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో 31 పోలింగ్ కేంద్రాల్లో 21171 మంది ఓట్లు వేయనున్నారు. వారిలో 11,836 మంది పురుషులు, 9200 మంది మహిళలు ఉన్నారు. తాడేపల్లిగూడెంలో 10 పోలింగ్ కేంద్రాలు, తణుకులో 12 పోలింగ్ కేంద్రాలు, పెంటపాడు, ఇరగవరం, అత్తిలి మండల కేంద్రాల్లో మూడేసి పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరగనున్నట్లు ఆర్డీవో ఖతీఫ్ కౌసర్ భనో తెలిపారు. ఈ పోలింగ్‌కు సంబందించిన బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రి ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం పంపిణీ చేశారు.

ఉండి: ఉండి మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1524మంది నమోదు అయ్యారని తహసీల్దారు కె.నాగార్జున తెలిపారు. ఉండి మండలంనకు సంబంధించి ఓటర్లు తమ ఓటును వేయడానికి ఉండి జడ్‌పి హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను 382, 383కేంద్రాలుగా ఏర్పాటుచేసారు. మండలంలోని పట్టభద్రుల ఓటర్లు అంతా ఇక్కడకు విచ్చేసి తమ ఓటును వినియోగించుకోవాలని తహశీల్దారు,ఎలక్షన్ డిటి రత్నకుమారులు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లును పూర్తిచేసినట్లు తెలిపారు.

అత్తిలి: అత్తిలి మండలంలో పట్టభద్రుల నియోజక వర్గానికి సంబంధించి మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. అత్తిలి డిగ్రీ కళాశాలలో మూడు పోలింగ్ బూత్‌లకు సంబంధించి 1334 మంది పురుషులు 928మంది స్త్రీలు ఓటు హక్కు వినియోగించుకోన్నట్లు తెలిపారు. పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

యలమంచిలి: యలమంచిలి ప్రాథమిక పాఠశాల, పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దారు జి.పవన్‌కుమార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను తహసీల్ధారు జి.పవన్‌కుమార్, ఎస్‌ఐ కె.గురయ్య పర్యవేక్షించారు. మండలంలో 2722 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు.

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ వై. రవి కుమార్ తెలిపారు. మూడు పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశామన్నారు. 408,409 పోలింగ్ స్టేషన్‌లలో బ్రాహ్మణ చెరువు మండల పరిషత్ యూపీ స్కూలులోను, 410 పోలింగ్ స్టేషన్ పెనుమంట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పెనుమంట్ర మండలంలో 2133 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు.

పెనుగొండ: ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జి. అనిత కుమారి తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి నాలుగు గంటల వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు 411, 412, 413 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశామన్నారు. నంబరు 411 పోలింగ్ స్టేషన్‌లో పెనుగొండలోని ఎస్వీకేపీ అండ్ ఎస్‌కెవీఆర్ గరల్స్ హైస్కూలు, 412 పోలింగ్ స్టేషన్ ఎస్వీకేపీ అండ్ ఎస్‌కెవీఆర్ గర్ల్స్ హైస్కూలు, 413 పోలింగ్ స్టేషన్ చెరుకువాడ ప్రజా పరిషత్ హైస్కూలులో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పెనుమంట్ర మండలంలో 2523 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు.

కాళ్ళ: కాళ్ళ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ జి.సుందర్‌సింగ్ తెలిపారు. కాళ్ళ మండలంలో మొత్తం 1465 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. గురువారం జరిగే ఎన్నికల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు.